


ఆగస్టు 2001 'రచన'లో 'గోదావరి కథలు' మీద మీ సమీక్ష ఆలస్యంగా చదివి పరవశించి ఇది రాయకుండా ఉండలేకపోతున్నాను. ఈ పుస్తకానికి రావలసిన ఖ్యాతి, All India గుర్తింపు, రాకపోవడం శోచనీయం. దీనికి కారణం ఏమిటి అంటారు? "అద్దరి - ఇద్దరి" ఏ రకంగా చూసినా అంతర్జాతీయ గుర్తింపు పొందవలసిన అర్హత ఉన్న కథ.

'రచన' మనుగడ కష్టమవడం తెలుగు జాతికి షేమ్. ఎందరు ధనవంతులు, సంస్కారవంతులు లేరు. హుండీలలో లక్షలు, కోట్లు వేస్తారే. సన్మాన సభలకు లక్షలు ఖర్చు చేస్తారే. అరుదయిన అపురూపమయిన ఒక సాహిత్య పత్రికకు జీవం పోయలేరా? ప్రతిభకు గుర్తింపు లేని 'రొడ్డకొట్టు' జాతి ఎలాగ అభివృద్ధి చెందేను అందరం ఆలోచించాలి.

**- యన్. ఆనందరావు** (విశాఖ)

'రచన' నవంబరు 2001 సంచికలో శ్రీయుతులు వై. రాంబాబు & శాయి వ్రాసిన 'నిరంతరం' అనే కథ చాలా చక్కగా ఉంది. వివిధ వ్యక్తుల మనస్తత్వాల విశ్లేషణ, వాళ్ళు ఫోన్‌లో మాట్లాడే మాటల్లో - వ్యక్తపరిచే ఈ రచన శ్లాఘనీయం.

చిన్న అచ్చు తప్పు అయివుండవచ్చు - రచనలో 18వ పేజీలో 3వ కాలంలో - రెండో పేరా "కందిపప్పు నం.1 - కిలో రెండుంబేడ అనీ, పప్పునూనె కిలో రెండ్రూపాయలు" అనీ వ్రాశారు.

అప్పుడు కొలతలు 'కిలో'లలో ఉండేవా? లేక వీశ, పదలం, ఏబులం అంటూ ఉండేవా? మీ చిన్నప్పుడంటే ఏ సంవత్సమో మరి?

ఇదో పెద్ద తప్పు కాదనుకోండి.

**- యం.వి. రావు** (రాజమండ్రి)

(తప్పు తప్పే కదా - సం॥)

మీరు పంపిన చిట్టచివరి విన్నపం అందింది. అంతకుముందు కూడా మీరు చందా కట్టమని వ్రాసిన ఉత్తరం కూడా అందింది. ఒక మిత్రుడి సలహా ద్వారా నేను 'రచన' పత్రికకు చందా దారుడిగా చేరాను. ఏ సంవత్సరంలో చందా దారుడిగా చేరానో గుర్తు లేదు. కానీ చందా కట్టిన తరువాత మీ (మా) పత్రిక చేరడం మొదలైంది. ఆ పత్రికను చూసిన తరువాత నాకు అర్థమైంది ఏమిటి అంటే తెలుగు సాహిత్యలోకానికి నిస్వార్థంగా సేవలు చేయాలనే పవిత్ర ఆశయం మీలో ఉందని. పత్రిక అంతా చదవాలని ఆశ ఉన్నా జీవిత ఆరాట పోరాటాల మధ్య పత్రికను పూర్తిగా చదవలేకపోయేవాడిని.

ఒక్కోసారి 'రచన' పత్రిక శంకర నారాయణ తెలుగు డిక్షనరీ అంత పెద్ద పుస్తకం లాగా వచ్చేది. దానిని చూసి దాచిపెట్టేవాడిని. ఏదో ఒక సమయంలో దానిని పూర్తిగా చదవాలని ఆశ. కానీ ఎక్కడా, తీరికలేదే. ఏదో సంపాదించాలని ఆశ, ఆరాటం. ఈ ఆరాట పోరాటాల మధ్యే కాలం కరిగిపోతూ ఉన్నదే తప్ప పత్రికలో ఉన్న ఎన్నో విలువైన విషయాల్ని, జీవిత పరి జ్ఞానాన్ని తెలుసుకుందామని ఆశ ఉన్నా సంపా దించాలనే ఆరాటం అందుకు సమయాన్ని కేటా యించలేక పోతున్నది. కానీ పత్రిక మాత్రం అల్మారాలో మురిగిపోతున్నది.

అక్షరం విలువ తెలిసిన వాడిని గనుక మీరు చేస్తున్న పనిలో మీకు నా వంతుగా ఏదైనా తోడ్పాటుని అందివ్వాలని నా మనసు కోరు కొనేది. తోడ్పాటు సంగతి దేవుడెరుగు చందా అయినా ప్రతి సంవత్సరం చెల్లించినా బాగుం డేది. మొట్టమొదట చేరేటప్పుడు చందా చెల్లిం చాను, మధ్యలో ఒకసారి ఇంకొక దఫా చెల్లిం చాను. మీకు ఎంత బాకీ పడ్డానో తెలియదు. పత్రిక వస్తూనే ఉంది. చందా చెల్లించాలని అనుకుంటూనే ఉన్నా నా కోడ్‌నెంబర్ 1417 చించి జేబులో పెట్టుకున్నా.

డబ్బులు లేక కొంత సమయం, డబ్బులు ఉన్నా కూడా తర్వాత చందా చెల్లిస్తాములే అనే నిర్లక్ష్యం. ఇంకా నిజాయితీగా చెప్పాలంటే చందా కట్టే దానికి మనస్సులో ఒప్పలేనితనం. నీతులు చెప్పడం చాలా సులభం. కానీ డబ్బు విషయం వచ్చే సరికి చాలామందికి మనస్సు అంత విశాలంగా ఉండదు. ఒకరకంగా నేను అలాంటి వాడినేమోననిపిస్తుంది.

ఎందువల్లంటే - మీరు చేస్తున్న పవిత్రమైన ఆశయాలు నాకు తెలుసు. అక్షరాల విలువ తెలుసు. పత్రిక విలువ తెలుసు. ఇన్ని తెలిసి కూడా పత్రికకు చందా కట్టడంలో నేను నిర్లక్ష్యం చేశానంటే నేను నిజంగా సాహితీద్రోహుడినే కదా.

అదీ కాకుండా నేను రైతుని. ఈ రైతు జీవితం కూటికి గుడ్డకి జరిగిపోవచ్చునేమో గాని డబ్బుకు మాత్రం ఎప్పుడూ కటకట. ఆర్థికంగా నిరంతర పోరాటం. తెచ్చుకున్న అప్పు డబ్బులు అయిపోతా యేమోననే భయం. కొత్తగా అప్పులు తేవాలంటే భయం. కొత్త అప్పు ఎవరిస్తారనే భయం. ఈ భయాల మధ్య జీవితం గడిచిపోతూ ఉంటుంది. రాబోయే పంటలు బాగా పండుతాయని దానితో అప్పంతా తీరిపోతుందని భ్రమ. ఏభై అయిదు సంవత్సరాలుగా ఈ భ్రమల్లోనే జీవితం నెట్టుకు వస్తున్నాను.

చందా కట్టమని జాబు వ్రాస్తే నీ కథ మాకు చెప్తున్నావు కదయ్యా అని మీరు అనుకుంటు న్నారు కదూ. అలా అనుకోకండి సార్. పత్రిక సాధక బాధకాలు నేను స్వయంగా అనుభవిస్తున్న వాడివి. నేను ఎం. ఎ. చదువుకుని వ్యవసాయం చేసుకుంటూ - రైతుల సేవార్థం గత 5 సంవత్స రాలుగా 'సింహపురి రైతు' మాసపత్రిక నడుపు తున్నాను. ఆ పత్రిక నడపడంలో డబ్బు ప్రసక్తి లేదు, లాభనష్టాల ప్రసక్తిలేదు. రైతులు బాగుండా లన్నదే ధ్యేయం. ఆ ధ్యేయంతో, ఒక పవిత్ర ఆశయంతో పత్రిక నడుపుతున్నాను.

తమాషా ఏమిటంటే - నా దగ్గర నయాపైసా డబ్బు లేదు. పైగా నాది ఋణ బాధల్లో ఉన్న జీవితం. ఇట్లాంటి పరిస్థితుల్లో నేను ఐదు సంవత్సరాలుగా నిరాటంకంగా మా గ్రామం నుండే పత్రికను నడుపుతున్నాను. నెల్లూరు జిల్లా రైతులందరికీ పత్రికను పంపిస్తున్నాను. అందరికీ కాదు, నాకు తెలిసిన రైతు సోదరులకు ఈ పత్రిక ప్రతి నెలా పంపిస్తుంటాను.

పత్రిక ఇలా నడవడం నా గొప్పతనం ఏమీ లేదు. నాది ఒక పవిత్రమైన ఆశయం. ఆ ఆశ యాన్ని భగవంతుడు గుర్తించి నా వెంట ఉండి దీన్ని నడుపుతున్నాడు. అంతే, అంతకు మించి నాలో ఏమీ గొప్పతనం లేదు.

మా రైతు సోదరులు పత్రికకు ప్రశంస జల్లులు కురిపిస్తారేగానీ చందామటుకు చెల్లిం చరు. చందా చెల్లించకపోతే పత్రిక నడిపేవారి పరిస్థితి ఎంత బాధగా ఉంటుందో నేను స్వయంగా అనుభవిస్తున్నాను.

స్వయంగా అనుభవిస్తూ కూడా నేను మీ పత్రికకు చందా చెల్లించలేదంటే నేను కూడా చేసింది తప్పే గదా. క్రియకు ప్రతిక్రియ తప్పదు సార్!

ఏది ఏమైనా చందా చెల్లించకుండా పత్రిక తీసుకోవడం నాది పొరపాటే. నా పొరపాటుని, ఆలస్యాన్ని, ఒప్పలేనితనాన్ని క్షమించండి.

మీకు బాకీ పడ్డ చందా, మళ్ళీ రాబోవు చందా అంతా త్వరలో చెల్లిస్తాను. నాకు ఇంకొక మాసం దినాలు గడువివ్వండి. తప్పకుండా మొత్తం చందా డిడి తీసి పంపిస్తాను.

అక్షరాల విలువ తెలిసి, పత్రిక విలువ తెలిసి, పత్రిక నడుపుతున్న వారి పవిత్ర ఆశ యం తెలిసి, పత్రిక నడిపే దానిలో గల బాధలు తెలిసి ఇన్ని బాధలు తెలుసుండి కూడా మీకు సహకారమివ్వలేని ఈ చిన్న రైతు సోదరుడిని క్షమించమని కోరుకుంటున్నా.

**- వి. నిరంజన్** (చెర్లోపాలెం)

❁